క్లుప్తంగా

విద్యుత్ అధికారుల అప్రమత్తం


మరమ్మతులు చేపడుతున్న విద్యుత్ సిబ్బంది

శ్రీకాళహస్తి : తొట్టంబేడు మండలంలో ఫెంగల్ తుపాన్ కారణంగా పలు విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. దీంతో మండలంలో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విద్యుత్‌శాఖ అధికారులు అప్రమత్తమై దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల పునరుద్ధరణ, మరమ్మతు పనులు చేపట్టారు. సుమారు రూ.2 లక్షలు నష్టం వాటిల్లినట్లు విద్యుత్‌శాఖ ఏఈ బాలాజీ తెలిపారు. శేష మనాయుడుకండ్రిగ, శివనాధపురం తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలను వెంటనే మార్చామన్నారు. సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటారని తెలిపారు.

రక్తదానంతో ప్రాణదానం


రక్తదానం చేస్తున్న యువత

శ్రీకాళహస్తి : రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడుదామని యువతరం సేవాసమితి సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సుమారు వంద మంది రక్తదానం చేయడం విశేషం. ఈ సందర్భంగా యువతరం సేవా సమితి సభ్యులు మాట్లాడుతూ.. తిరుపతి రుయా ఆస్పత్రిలో రక్తనిల్వలు చాలా తక్కువ ఉన్నాయన్నారు. దీంతో గర్భిణులు , చిన్నపిల్లలు తీవ్ర ఇబ్బందుల పడుతుండటంతో రక్తదాన శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. అధిక సంఖ్యలో విచ్చేసి రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

4న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 4వ తేదీ బుధవారం హుండీ లెక్కింపు జరగనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆలయ ప్రధాన హుండీతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీలను దక్షిణామూర్తి సన్నిధి వద్ద లెక్కించనున్నట్లు చెప్పారు. ఆలయ అధికారులు, సిబ్బంది, ఉద్యోగులు తప్పనిసరిగా హుండీ లెక్కింపులో పాల్గొనాలని కోరారు.

విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలి


విద్యార్థులకు కార్పెట్లు పంపిణీ చేస్తున్న బీసీ సంక్షేమ అధికారి చంద్రశేఖర్

బుచ్చినాయుడుకండ్రిగ : విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానానికి చేరుకోవాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలోని బీసీ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు కార్పెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హాస్టల్‌లో త్వరలోనే శంకరన్ నాలెడ్జ్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఆడియో, వీడియో పాఠాల ద్వారా బోధించటం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

కూలిన సెల్ టవర్


ఇంటి గోడపై పడిన సెల్ టవర్

శ్రీకాళహస్తి : పట్టణంలోని భాస్కరపేటలో నిరుపయోగంగా ఉన్న సెల్ టవర్ శనివారం కూలిపోయింది. భాస్కరపేట పట్టణ ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఉపయోగంలోని సెల్ టవర్ ఉంది. శనివారం మధ్యాహ్నం నుంచి భాస్కరపేట ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీలకు సెలవు ప్రకటించారు. ఆ సమయంలో కూలడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే ఇంటిపై పడటంతో గోడలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. సచివాలయ అధికారులు తెలిపినా పట్టించుకోలేదని సంబంధిత అధికారులు స్పందించి సెల్ టవర్‌ను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

- పెరుగుతున్న చలి.. వణుకుతున్న జనం
- రోడ్లను కమ్మేస్తున్న పొగమంచు
- వ్యాధుల వ్యాప్తిపై జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు


ఈదురు గాలులతో కురుస్తున్న చిరుజల్లులు

ఆరోగ్య రక్ష.. వ్యాధులకు శిక్ష

వరదయ్యపాళెం : అటు తుపాన్ ప్రభావం.. ఇటు శీతల వాతావరణంతో ఒక్కసారిగా చలి తీవ్రత పెరిగింది. దీంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు. ఆ మేరకు సత్యవేడు నియోజకవర్గంలో ప్రజలు బయటకు రావాలంటే జంకుతున్నారు. కనిష్ఠంగా ఉష్ణోగ్రతలు 18–29 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. సూర్యోదయం ఆలస్యం అవుతోంది. రహదారులపై కమ్మేసిన మంచు పొరలు రాత్రివేళ, తెల్లవారుజామున వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి.

పొగమంచు కారణంగా ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిచోట్ల వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా చలి తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు ఒంటికి స్వెటర్లు, తలకు ముసుగులు లేనిదే బయటకు రాలేని పరిస్థితి నెలకొంది.


రోడ్డు మార్గంలో కమ్ముకున్న పొగమంచు

ఉదయాన్నే బయటకు వెళ్లకుండా చూసుకోవాలి..

శీతల వాతావరణంలో ఆస్తమా బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయాన్నే బయటకు రావడం వల్ల ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరి శ్వాసకోస సమస్యలు అధికమయ్యే అవకాశాలు ఉన్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. న్యూమోనియా, ఆస్తమా, ఊపిరితిత్తుల్లో నెమ్ము చేరడం, ముక్కుదిబ్బడ, గొంతు రాపిడి, టాన్సిల్స్ సమస్యలు అధికమవుతున్నాయి. శ్వాసకోశ నాళికలు కుంచించుకుపోవడంతో గాలి లోపలికి పోవడం తగ్గి ఆయాసం ఎక్కువగా రావడం జరుగుతుంది. ముఖం, చేతులు, కాలి వేళ్లపై చలి చేరడం వల్ల అక్కడ నాళికలు కుంచించుకుపోయి శరీరం బూడిద వర్ణంలా మారుతుంది.

వ్యాధుల నుంచి ఉపశమనం

చలికాలంలో కొన్ని జాగ్రత్తలు పాటిస్తే పలు వ్యాధుల నుంచి ఉపశమనం కలుగుతుంది. ఏసీ వాడకం, చల్లని నీరు తాగడం తగ్గించాలి. వేడి నీటి ఆవిరిని పీల్చడం వల్ల శ్వాసకోశ సమస్యలకు కొంత మేర ఉపశమనం లభిస్తుంది. చలి సోకకుండా బిగుతైన దుస్తులు ధరించడం, చేతి వేళ్లకు కాటన్ గ్లౌజులు వాడాలి. మఫ్లర్‌లు తలకు తప్పనిసరిగా వాడాలి. రాత్రివేళ త్వరగా పడుకుని ఉదయం నిద్ర లేచే సమయాన్ని కచ్చితంగా అమలు చేయాలి.

> **ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి**
>
> 
>
> చలికాలంలో పిల్లలు, పెద్దలు శరీరాన్ని రక్షించుకునేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వీలైనంత వరకు ఉదయాన్నే బయటకు రాకుండా చూసుకోవాలి. అవసరమైతే ముక్కు, నోరు, చెవులకు గుడ్డ తప్పనిసరిగా అడ్డుపెట్టుకోవాలి. ఫ్రిజ్‌లో ఉంచిన వస్తువులను వాడకూడదు. చల్లని పదార్థాలను వృద్ధులు, చిన్నారులకు దూరంగా ఉంచాలి. కాచి చల్లార్చిన నీటినే తాగాలి.
>
> – ఉదయ్ కుమార్, వైద్యాధికారి, వరదయ్యపాళెం పీహెచ్‌సీ

ఉధృతంగా గొడ్డేరు వాగు

- రాకపోకలు బంద్

సత్యవేడు : మండలంలోని ఓబులరాజు కండ్రిగ సమీపంలోని గొడ్డేరు వాగు ఫెంగల్ తుపాను నేపథ్యంలో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో సత్యవేడు–సూళ్లూరుపేట వయా పీవీపురం మార్గంలో బస్సు సర్వీసు రద్దు చేశారు. ఆదివారం గొడ్డేరు వాగులో నీటి ప్రవాహం వేగంగా ఉండడంతో సత్యవేడు మండలంలోని ఓబులరాజు కండ్రిగ, పీవీపురం, రాజగోపాలపురం, చమర్తి కండ్రిగ గ్రామాల ప్రజలు నాగలాపురం వెళ్లేందుకు అవస్థలు పడ్డారు.10 కిలోమీటర్లు దూరంలోని నాగలాపురానికి సత్యవేడు మీదుగా సుమారు 40 కిలోమీటర్లు దూరం అదనంగా ప్రయాణించాల్సి దుస్థితి నెలకొంది. వాగులో ద్విచక్ర వాహన దారులు, బాటసారులు అటు వైపుగా ప్రయాణించరాదని సత్యవేడు, నాగలాపురం పోలీసులు హెచ్చరించారు. సత్యవేడు, నాగలాపురం మండలాల రెవెన్యూ , సచివాలయ సిబ్బంది, వీఆర్‌ఓలు అక్కడే ఉంటూ ఎవరినీ అటువైపు వెళ్లనీయకుండా చర్యలు చేపట్టారు.

కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా రాజేంద్ర రాయల్

తిరుపతి కల్చరల్: జాతీయ కాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన సుంకర రాజేంద్ర రాయల్‌ను నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కె.మురళీకృష్ణ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలి

శ్రీకాళహస్తి : ఫెంగల్ తుపాన్‌తో నియోజకవర్గంలో పంట నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షుడు రామానాయుడు , సీపీఐ నాయకుడు గురవయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం వారు మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సాగు చేసిన వరితో పాటు ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయాధికారులు స్పందించి పంటలను పరిశీలించి నష్ట పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు. వర్షానికి దెబ్బతిన్న ఇళ్లకు నష్ట పరిహారం అందజేయాలన్నారు. కొత్తగా పంటలు వేసుకోవడానికి విత్తనాలు, ఎరువులు, పంటలకు అయ్యే ఖర్చులను వెంటనే ఇవ్వాలన్నారు. సహకార సంఘాల ద్వారా రుణాలు తీసుకుని చెల్లించలేక ఇబ్బంది పడుతున్న రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలన్నారు. అదే విధంగా వ్యవసాయానికి పెట్టుబడిసాయం కింద రూ.20 వేలు వెంటనే అందజేయాలని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు 25 కిలోల ఉచిత బియ్యం అందజేయాలని కోరారు.

చేనేత కార్మికులను ఆదుకోండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న చేనేత కార్మిక సంఘం నేతలు

వరదయ్యపాళెం : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు మగ్గపు గుంతల్లోకి నీరు చేరి ఉపాధి కోల్పోయామని బాధిత కార్మికులు ఆదివారం తహసీల్దార్ రాజశేఖర్‌కు వినతిపత్రం అందించి సమస్యలను విన్నవించారు. నేతకు ఉపయోగించే ముడి సరుకులు పూర్తిగా నానిపోయి నేత నేయలేని పరిస్థితిలో ఉన్నామని వాపోయారు. ఈ వర్షాభావ పరిస్థితుల నుంచి తేరుకుని తిరిగీ మగ్గం నేసేందుకు దాదాపు నెలరోజుల సమయం పడుతుందని, అప్పటి వరకు మా పరిస్థితి దయనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. పరిస్థితులను ప్రభుత్వానికి విన్నవించి ఆర్థికంగా ఆదుకోవాలని నేత కార్మికులు మొరపెట్టుకున్నారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో చేనేత సంఘం నాయకులు పృథ్వీ రవి, బుర్రా కృష్ణమూర్తి, కె. వెంకటేశ్వర్లు, గోపి, బీరక వెంకట్రాయులు, దేవసుందరం, గుత్తి త్యాగరాజు ఉన్నారు.

బస్సుల దారి మళ్లింపు


ఎంఎంసి కండ్రిగలో నీటి ప్రవాహాన్ని మళ్లిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి రూరల్ : ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఆదివారం మండలంలోని 72 చెరువులు పూర్తిగా నిండాయి. ఎంఎంసికండ్రిగ గ్రామంలోని చెరువు పూర్తి స్థాయిలో నిండటంతో అధికారులు గ్రామంలోకి నీరు రాకుండా జేసీబీ పెట్టి నీటిని దారి మళ్లించారు. శ్రీకాళహస్తి వెంకటగిరి రహదారిలో వాగులు పొంగి వంతెనపైకి నీరు రావడంతో వెంకటగిరి బస్సులను ఏర్పేడు మీదుగా దారి మళ్లించారు.

మల్లెమడుగు జలాశయం 14 గేట్లు ఎత్తివేత

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : వరద నీరు అనుకున్న స్థాయి కంటే ఎక్కువ రావడంతో మల్లెమడుగు జలాశయం 14 గేట్లను ఎత్తివేసినట్లు జీఎన్ఎస్ఎస్ అధికారులు తెలిపారు. శనివారం అర్ధరాత్రి శేషాచలం కొండల నుంచి భారీగా జలాశయానికి వరద నీరు చేరుకోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు డీఈ చంద్రమౌళి తెలిపారు. రిజర్వాయర్ సామర్థ్యం 0.181 టీఎంసీలు కాగా నీరు కూడా అదే స్థాయికి చేరుకుందని, దీంతో 14 గేట్లను ఒకటిన్నర అడుగు ఎత్తున ఎత్తినట్లు తెలిపారు. ఇన్ ఫ్లో 4050 క్యూసెక్కుల నీరు రాగా 4250 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు.

భిక్షాండేశ్వరికి ప్రత్యేక పూజలు

నాగలాపురం : పిచ్చాటూరు మండలం వెంగళత్తూరులో కొలువైన భిక్షాండేశ్వరి అమ్మవారికి ఆదివారం అమావాస్య సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఆలయ ప్రధాన అర్చకులు గురుశర్మకుమార్, చంద్రు అమ్మవారికి పంచామృతంతో అభిషేకం నిర్వహించి అలంకరించి దూప దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం భజన గురువులైన లోకేష్‌దాస్ బృందంతో భక్తులను ఆకట్టుకునేలా పండరి భజన నిర్వహించారు.

అంధకారంలో పల్లెలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట మండలంలోని పలు గ్రామాలు రెండు రోజులుగా అంధకారంలో ఉన్నాయి. ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలు కారణంగా మామండూరు, చైతన్యపురం, గుండ్రాల కాలవ, ఎస్‌యుపురం, కృష్ణాపురం గ్రామాల్లో శనివారం సాయంత్రం నుంచి విద్యుత్తు సరఫరా లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనీసం రాత్రి వేళలలో అయిన విద్యుత్తు సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రం తాత్కాలికంగా మూత


మామండూరు పర్యాటక కేంద్రం ప్రవేశం మూత

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : తుపాన్ కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మామండూరు పర్యాటక కేంద్రాన్ని అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. అడవిలోని పెద్దయేరు జలపాతంలో అధికంగా వరద నీరు ప్రవహిస్తుండటంతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పర్యాటక కేంద్రం ప్రవేశం వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పర్యటకులను అనుమతించడం లేదు. వరద నీరు తగ్గిన అనంతరం పర్యటకులను అనుమతిస్తామని పర్యాటక కేంద్రం కమిటీ చైర్మన్ కుమారస్వామి తెలిపారు.

బురదలోనే ప్రయాణాలు

- అధ్వానంగా రహదారులు


విజ్ఞాన్‌నగర్‌లో సినిమా హాలు వెనుక వీధి ఇలా..

వరదయ్యపాళెం : పేరుకే మేజర్ పంచాయతీ.. అభివృద్ధిలో అంతా వెనుకబాటే.. ఈ పంచాయతీలో ఎటుచూసినా సమస్యలే. తాజాగా కురుస్తున్న వర్షాలకు వరదయ్యపాళెం పంచాయతీ పరిధిలోని విజ్ఞాన్‌నగర్‌లో ఏ వీధి చూసినా చెరువులను తలపిస్తున్నాయి. ఈ వీధుల్లో స్థానిక ప్రజలు అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితుల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా స్థానిక పంచాయతీ పాలకులకు మాత్రం ఏమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పంచాయతీకి రాబడి ఉన్నప్పటికీ అభివృద్ధి మాత్రం కానరావడం లేదు. ఇళ్ల పన్నులు ముక్కు పిండి వసూళ్లు చేస్తారు గానీ అభివృద్ధి విషయంలో ఆ చొరవ కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. కనీసం సీసీ రోడ్ల మాట దేవుడెరుగు గానీ తట్టమట్టి చల్లిన పరిస్థితి లేదు. స్థానిక ప్రజలు రోడ్ల దుస్థితి గురించి అనేకమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా ఏమాత్రం స్పందన లేదని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రాధాన్యం క్రమంలో ఇబ్బందికరంగా ఉన్న ప్రాంతంలో సిమెంటు రోడ్ల నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నక్కలవంక ప్రవాహంతో రాకపోకలు బంద్

రేణిగుంట (ఏర్పేడు) : చినుకు పడితే ఆ పల్లె ప్రజలు వణికిపోతారు. ఊరు శివారున ప్రవహించే స్వర్ణముఖి నదిలో కలిసే నక్కల వాగు నీటి ప్రవాహం ఆ గ్రామ రాకపోకలను నియంత్రిస్తోంది. ఏటా అవే అవస్థలు వారిని కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఏర్పేడు మండలం పాపానాయుడుపేట నుంచి చెన్నంపల్లి, పెన్నగడం, కల్లూరు గ్రామాలకు వెళ్లాలంటే స్వర్ణముఖి నదిలోని నక్కల వంక దాటాలి. వర్షం కురిస్తే ఈ వాగు ప్రవాహంతో ఆ గ్రామాలకు ఏరు దాటలేని పరిస్థితి నెలకొంది. తాజాగా తుపాన్ దాటికి నక్కల వాగు ప్రవాహంతో రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం ఉధృతి తగ్గినా, నక్కలవాగులో గాజులమండ్యం ఎస్టేట్ కర్మాగారాల నుంచి కలిసే రసాయన వ్యర్థాలు నీటి ప్రవాహంలో కలసి ఆ నీటిలో నడిస్తే... కాళ్లు బొబ్బలెక్కి చర్మవ్యాధులకు గురవుతున్నారు. తమ గ్రామాలకు రాకపోకలకు ఇబ్బంది కలగకుండా కాజ్ వే నిర్మించాలని దశాబ్దాల తరబడి ఆందోళనలు చేస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

గౌతు లచ్చన్న సేవలు ఆదర్శం


గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని స్వర్ణముఖి నది వంతెన సమీపంలో ఏర్పాటు చేసిన గౌతు లచ్చన్న విగ్రహానికి ఆదివారం ఆల్ ఇండియా జాతీయ గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ.. గౌతు లచ్చన్న సేవల అందరికీ ఆదర్శనీయమని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పేరం శివ నాగేశ్వరరావుగౌడ్, వెంకటశివా గౌడ్, తిరకాల పురుషోత్తం గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, మోహన్‌గౌడ్, శ్రీరాములుగౌడ్, ఆనంద్‌గౌడ్, రవి గౌడ్, గణేష్‌గౌడ్, రామయ్య గౌడ్ పాల్గొన్నారు.





మల్లెమడుగు జలాశయం వద్ద పరవళ్లు తొక్కుతున్న వరద నీరు, కడూరు కూడలి వద్ద కాజ్‌వేపై ప్రవహిస్తున్న వరదనీరు, సదాశివ కోన రిజర్వాయర్ ప్రవాహం, పాలమంగళం హైస్కూల్‌లో నేలకొరిగిన భారీ వృక్షం

నిండిన చెరువులు.. పొంగిన వాగులు

- జలదిగ్బంధంలో గ్రామాలు
- స్తంభించిన రాకపోకలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట) : రేణిగుంట మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ఆదివారం వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. ప్రధానంగా అత్తూరు గ్రామానికి వెళ్లే రహదారిలో వాగు వంతెనపై ప్రవహించడంతో రాకపోకలు స్తంభించాయి. అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. విధి లేని పరిస్థితుల్లో గ్రామస్తులు ఇళ్లకు చేరుకునే దానికి ఒకరినొకరు చేతులు పట్టుకొని ప్రమాదకర స్థితుల్లో వాగు ఉధృతిని దాటి ఇళ్లకు చేరుతున్నారు. అమ్మవారి పట్టెడ, అరుంధతివాడ, అత్తూరు మూడు గ్రామాలకు ఒకటే రహదారి కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రేణిగుంట పంచాయతీ పరిధిలోని గువ్వల కాలనీ, గాంధీనగర్ కాలనీ, బీసీ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, లోతట్టు ప్రాంతంలోని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. జి పాలెం పంచాయతీ పరిధిలోని కురకాలవ పద్మానగర్‌లోని ఇళ్లల్లోకి పక్కనే ఉన్న చెరువు కలుజు ప్రవహిస్తుండడంతో వరద నీరు పద్మానగర్‌ను తాకుతూ ప్రవహిస్తోంది.


కాంపాళెంలో నీట మునిగిన వరి


నారాయణవనం: కొట్టుకుపోయిన తుంబూరు కాజ్‌వేపై పారుతున్న నది

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం : తుపాన్ ప్రభావంతో 3 రోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. మండలంలోని పలు మార్గాలలో 2 రోజులుగా రాకపోకలు స్తంభించాయి. ప్రధానంగా సంతవేలూరు మార్గంలో సుమారు 10 గ్రామాలకు, అలాగే పెద్ద పాండూరు నుంచి తొండంబట్టుకు వెళ్లే మార్గంలో మరో 5 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. ఎటుచూసినా వర్షపునీరు చెరువులు, వాగులు, వంకలకు చేరి ఉధృతంగా ప్రవహించాయి. కడూరు కూడలి, పెద్ద పాండూరు సమీపంలోని రాళ్ల కాలువ వంతెనలపై నీటి ఉధృతి కొనసాగింది.

కోతకు గురైన కారిపాకం రోడ్డు

బత్తలవల్లం నుంచి కారిపాకంకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు వితయ్యపాళెం వద్ద కోతకు గురైంది. కల్వర్టు వద్ద వరదనీటి ఉధృతికి ఒక్కసారిగా రోడ్డు అడ్డంగా కోతకు గురైంది. దీంతో ఆ మార్గంలోని పులివల్లం, వితయ్యపాళెం గ్రామస్తుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

లోతట్టు ప్రాంతాల పరిశీలన

వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాలను తహసీల్దార్ రాజశేఖర్ పరిశీలించారు. ఆదివారం ఆయన వరదయ్యపాళెంలోని బీజీఆర్‌కాలనీ, అనిల్ సెంటర్, కంచరపాళెం గిరిజనకాలనీ, నక్కలమిట్ట ప్రాంతాలను సందర్శించి ప్రజల ఇబ్బందులను తెలుసుకున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

వర్షాలకు రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. చిన్న పాండూరు, వరదయ్యపాళెం, సంతవేలూరు సబ్ స్టేషన్ల పరిధిలో శని, ఆది వారాల్లో సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. అక్కడక్కడా ఆదివారం రాత్రి సరఫరా పునరుద్ధరణ పనులు చేసినప్పటికీ కొన్నిచోట్ల మాత్రం సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

నీటమునిగిన పంట పొలాలు

బుచ్చినాయుడుకండ్రిగ : ఫెంగల్ తుపాన్ ప్రభావంతో ఆదివారం ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో కాళంగి నది ప్రవహించే లోతట్టు గ్రామాలైన తహనగర్, సుద్దమిట్ట గిరిజన కాలనీ జలమయం అయ్యాయి. దీంతో తహసీల్దార్ సుబ్రహ్మణ్యం, ఎస్ఐ విశ్వనాథనాయుడు కాళంగి నది ప్రవాహాన్ని పరిశీలించి ప్రజలను అప్రమత్తం చేశారు. వర్షంతో కాళహస్తి–తడ రోడ్డు అధ్వానంగా తయారైంది. వరి పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈదురుగాలులకు పలుచోట్ల భారీ వృక్షాలు నేలకూలాయి.

ఏర్పేడులో..

రేణిగుంట(ఏర్పేడు) : తుపాన్ ప్రభావంతో ఏర్పేడు మండలంలో చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. మండలంలోని చెల్లూరు సదాశివ కోన రిజర్వాయర్ నిండి ఉప్పొంగి ప్రవహిస్తోంది. జంగాలపల్లి కలుజు వద్ద కట్టకు గండి పడింది. కొత్తవీరాపురం, గోవిందవరం వద్ద స్వర్ణముఖి నది లో లెవెల్ కాజ్ వే మీద నీటి ప్రవాహం ఉండటంతో రాకపోకలు నిలిచిపోయాయి.

నారాయణవనంలో..

నారాయణవనం : ఫెంగల్ తుపాను ప్రభావంతో జనజీవనం స్తంభించింది. అరుణానది ఉధృతంగా ప్రవహించడతో శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి అరుణానదిని, కాజ్‌వేలను డ్రోన్ సాయంతో వీడియోను పరిశీలించి అధికారులను అప్రమత్తం చేశారు. రెండు నెలల కిందట కురిసిన వర్షానికి పాక్షికంగా కోతకు గురైన తుంబూరు కాజ్‌వే ఆదివారం వర్షాలకు కొట్టుకుపోయింది. కైలాసనాథ కోనలో జలపాతం నిండుగా ప్రవహించడంతో స్నానాలను నిషేధించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు.


సత్యవేడు: కోతకు గురైన కారిపాకం రోడ్డు


జంగాలపల్లి చెరువు కాలుజుకు గండి